క్లుప్తంగా

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న విద్యార్థినులు, ఉపాధ్యాయులు

అక్కన్నపేట(హుస్నాబాద్): అన్ని సంక్షేమ, గురుకుల హాస్టల్‌ల్లో ఉన్న విద్యార్థులకు మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచడం పట్ల అక్కన్నపేట గిరిజన సంక్షేమ బాలికల కళాశాల ప్రిన్సిపాల్ అనిత హర్షం వ్యక్తం చేశారు. ఆమె ఆధ్వర్యంలో విద్యార్థినులు సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం మాట్లాడుతూ కళాశాలల్లో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచడం పట్ల సంతోషం వ్యక్తం చేశారన్నారు. సీఎంకు ఉపాధ్యాయులు, విద్యార్థినులు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థినికి ఉపాధ్యాయుల అభినందనలు



రవీంద్రభారతిలో బహుమతి, జ్ఞాపికను అందుకుంటున్న ప్రహరిణి

సిద్దిపేటరూరల్: బాలల కథల పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి ప్రోత్సాహక బహుమతిని అందుకున్న జక్కాపూర్ విద్యార్థిని కారంకంటి ప్రహరిణి ఉపాధ్యాయులు గ్రామస్తులు అభినందించారు. తెలంగాణ రాష్ట్ర భాషా సంస్కృతిక శాఖ సహకారంతో మాచిరాజు బాల సాహిత్య పీఠం ఆధ్వర్యంలో నిర్వహించిన బాలల కథల పోటీల్లో నారాయణరావుపేట మండలం జక్కాపూర్‌కు చెందిన 9వ తరగతి విద్యార్థిని ప్రహరిణి ఉత్తమ ప్రతిభ కనబరించింది. ఆదివారం హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో జరిగిన కార్యక్రమంలో మాచిరాజు బాల సాహిత్య పీఠం వారు సన్మానించారు. ప్రోత్సాహక బహుమతితో పాటుగా రూ. 500 విలువ కలిగిన పుస్తకాన్ని జ్ఞాపికగా అందించారు. చదువుతో పాటుగా సాహిత్యంలో రాణిస్తున్న విద్యార్థినిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు షౌకత్‌అలీ, అమ్మ ఆదర్శ కమిటీ, గ్రామస్తులు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మాచిరాజు బాలసాహిత్య పీఠం వ్యవస్థాపకుడు కామేశ్వరరావు, ప్రొ.మృణాళిని, వేణుగోపాల్, అనసూయ, పాఠశాల తెలుగు ఉపాధ్యాయురాలు, కరుణ తదితరులు పాల్గొన్నారు.

అంబులెన్స్‌లో ప్రసవం



కొండపాక(గజ్వేల్): 108లో మహిళ ప్రసవించింది. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారు. తెలిసిన వివరాల ప్రకారం.. చేర్యాల మండలం చిట్యాలకు చెందిన సౌందర్యకు ఆదివారం ప్రసవ నొప్పులు వస్తున్నాయని కుటుంబీకులు 108కు సమాచారం ఇచ్చారు. ఇక్కడి చేరుకున్న సిబ్బంది గణేశ్, రమేశ్‌లు వాహనంలో సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తున్నారు. మార్గ మధ్యంలో నొప్పులు అధికమవ్వడంతో ఉన్నత స్థాయి వైద్యుల సూచనల మేరకు సౌందర్యకు వారు ప్రసవం చేశారు. దీంతో ఆమె మగ బిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డ క్షేమంగా ఉండటంతో సిబ్బందికి కుటుంబీకులు, బంధువులు కృతజ్ఞతలు తెలిపారు.

డైట్ చార్జీల పెంపుపై హర్షం



హుస్నాబాద్‌రూరల్: ప్రభుత్వం గురుకుల, సంక్షేమ హాస్టల్స్ విద్యార్థుల మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంపుపై ఆదివారం గిరిజన గురుకుల విద్యార్థులు సంబురాలు జరుపుకొన్నారు. పెంపు వల్ల 8.50 లక్షల విద్యార్థులకు ప్రయోజనం కలుగుతుందన్నారు. విద్యార్థుల సంక్షేమం కోసం సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. నెలనెలా కాస్మోటిక్ చార్జీలకు ఇబ్బందులు పడ్డామన్నారు. ఇక తమ కష్టాలు తీరుతాయన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

నాచగిరి.. వ్రతాలతో శోభిల్లి



నాచగిరిలో వ్రతమాచరిస్తున్న దంపతులు

నాచారంగుట్ట నాచగిరి శ్రీలక్ష్మీనృసింహక్షేత్రం ఆదివారం భక్తులతో పోటెత్తింది. కార్తీక సామూహిక సత్యనారాయణ వ్రతాలతో శోభిల్లింది. దర్శనానికి వచ్చిన భక్తజనంతో కిటకిటలాడింది. కార్తీక మాసంలో వారాంతపు సెలవురోజు కలిసిరావడంతో హైదరాబాద్, సికింద్రాబాద్, ఉమ్మడి మెదక్ జిల్లాల నుంచి భక్తులు భారీగా తరలి వచ్చారు. హల్దీనది వాగులో పుణ్యస్నానాలు ఆచరించారు. దంపతులు వ్రత మండపంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతమాచరించారు. అనంతరం గర్భగుడిలో కొలువైన శ్రీలక్ష్మీనారసింహులను దర్శించుకున్నారు. వ్రత, కల్యాణ, అభిషేకాది మొక్కులు తీర్చుకున్నారు. తీర్థప్రసాదాలు స్వీకరించి తరించారు.

వర్గల్(గజ్వేల్)

మందుబాబులకు అడ్డా..



చిన్నకోడూరు మండలంలోని పలు గ్రామాల పంట భూములు, చెట్ల పొదలు, ప్రహరీ లేని ప్రభుత్వ పాఠశాలలను మందుబాబులు అడ్డాగా చేసుకున్నారు. మద్యం తాగి సీసాలను పగలగొట్టడం, ఇక్కడే పడేస్తుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వ్యవసాయ పనులు చేపడుతుతున్నామని, పగిలిన సీసాలతో గాయాల పాలవుతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. - చిన్నకోడూరు(సిద్దిపేట)

వినియోగంలోకి వచ్చేదెన్నడో?

- రూ. 5 లక్షలతో అత్యాధునిక టాయిలెట్స్ నిర్మాణం
- నాలుగేళ్లుగా నిరుపయోగం

దుబ్బాకటౌన్: స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా దుబ్బాక పట్టణంలో రామసముద్రం చెరువు కట్టపై మున్సిపల్ ఆధ్వర్యంలో నాలుగేళ్ల క్రితం సుమారు రూ.5 లక్షల నిధులతో నిర్మించిన అత్యాధునిక టాయిలెట్లు నిరుపయోగంగా మారాయి. ఏళ్లు గడుస్తున్నా పట్టించుకునే నాథుడే కరవయ్యాడు. కట్ట సుందరీకరణలో భాగంగా ఉదయం, సాయంత్రం ప్రకృతి అందాలను వీక్షించేందుకు వచ్చే, వాకింగ్‌కు వచ్చే ప్రజల కోసం మున్సిపల్ ఆధ్వర్యంలో 4 అత్యాధునిక టాయిలెట్లను, దానిపై రెండు నీటి ట్యాంకులను నిర్మించారు. సంవత్సరాలు గడిచిపోతున్నా అధికారులు నిర్వహణ మరిచారు. దీంతో చెట్ల పొదలు పెరిగి అధ్వానంగా మారాయి. ప్రారంభంలో కొన్ని రోజులు ఉపయోగించిన రానురానూ వాటిని శుభ్రపరిచేందుకు సిబ్బంది కొరత, నిర్వహణ వైఫల్యంతో అవి వృథాగా మారాయి. ఇకనైనా అధికారులు స్పందించి చెట్ల పొదలను తొలగించి టాయిలెట్లను వినియోగంలోకి తీసుకు రావాలని ప్రజలు కోరుతున్నారు.



టాయిలెట్లు

త్వరలో అందుబాటులోకి తెస్తాం



దుబ్బాక పట్టణంలో రామసముద్రం కట్టపై నిర్మించిన టాయిలెట్లను త్వరలో ఉపయోగంలోకి తీసుకురావడానికి చర్యలు తీసుకుంటాం. పే అండ్ యూజ్ టాయిలెట్స్ కావడంతో నిర్వహణ సిబ్బంది ఎవరు కూడా ముందుకు రావడం లేదు. సిబ్బంది ఏర్పాటు చేసి వీలైనంత త్వరగా తిరిగి ప్రారంభిస్తాం

\- రమేశ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్, దుబ్బాక

సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

డీఈ భానుప్రకాశ్

గజ్వేల్: సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు గజ్వేల్ విద్యుత్ శాఖ డీఈ భాను ప్రకాశ్ అన్నారు. ఆదివారం గజ్వేల్ సబ్ డివిజన్ కార్యాలయం ఆవరణలో విద్యుత్ వినియోగదారుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈ మాట్లాడుతూ ప్రజల్లో అవగాహన కల్పించడమే లక్ష్యంగా వినియోగదారుల సదస్సులను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా వారి నుంచి ఫిర్యాదులను స్వీకరించి పరిష్కారానికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గజ్వేల్ ఏడీఈ జగదీశ్, ఏఈ మారుతీ తదితరులు పాల్గొన్నారు.

బెజ్జంకి(సిద్దిపేట): వినియోగదారులకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు కృషి చేస్తున్నామని ఏడీఏ సుధీర్ బాబు పేర్కొన్నారు. స్థానిక ఏడీఏ కార్యాలయంలో వినియోగదారుల దినోత్సవం సందర్భంగా ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎక్కడైనా సరే విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగినప్పుడు, ట్రాన్స్‌ఫార్మర్‌లు కాలిపోయినప్పుడు సమాచారమిస్తే త్వరితగతిన పరిష్కారించేలా చూస్తామన్నారు. తీవ్రమైన సమస్యలు ఉన్నప్పుడు ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారిస్తామన్నారు. అనంతరం వినియోగదారుల సమస్యలపై దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో బెజ్జంకి, బస్వాపూర్ ఏఈలు మహేశ్, రామాంజనేయులు, ఎస్ఈ పవన్, రైతులు పాల్గొన్నారు.



బెజ్జంకి(సిద్దిపేట) : వినియోగదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఏడీఏ సుధీర్‌బాబు



గజ్వేల్‌లో వినియోదారుల నుంచి ఫిర్యాదు స్వీకరిస్తున్న అధికారులు

ఎమ్మెల్యే సొంత నిధులతో రోడ్డుకు మరమ్మతులు



మరమ్మతులు చేపట్టిన కొండాపూర్- తిమ్మాపూర్ రోడ్డు

మిరుదొడ్డి(దుబ్బాక): దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి సొంత ఖర్చులతో మండలంలోని కొండాపూర్ రోడ్డుకు మరమ్మతులు పనులు చేయించారు. కొండాపూర్ నుంచి దుబ్బాక మండలం తిమ్మాపూర్ వరకు గల రోడ్డు పూర్తిగా గుంతల మయమైందని, సిద్దిపేట జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే ఇబ్బందులు తలెత్తుతున్నాయని కొండాపూర్ గ్రామస్తులు ఇటీవల ఆయనకు విన్నవించారు. సానుకూలంగా స్పందించిన ప్రభాకర్ రెడ్డి మట్టితో గుంతలు పూడ్చివేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

- పలువురిని అదుపులోకి తీసుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు
- రూ.31,919 నగదు, 9 మొబైల్‌లు స్వాధీనం

వర్గల్(గజ్వేల్): వర్గల్ మండలం మీనాజీపేట శివారులో పేకాట శిబిరంపై ఆదివారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేశారు. గౌరారం ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మీనాజీపేట శివారులో కొంతమంది పేకాట ఆడుతున్నట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులకు సమాచారం అందింది. వారు, గౌరారం పోలీసులు స్థావరంపై దాడులు చేశారు. అక్కడ పేకాట ఆడుతున్న కొట్టె నరసింహారెడ్డి(మల్లుపల్లి), ఎర్రోల్ల గిరి (జీడిపల్లి), దాచారం కుమార్ (వేలూరు), బులబోయిన దేవేందర్ (మనోహరాబాద్), మరాఠి రాజు (దండుపల్లి), బుక్క సురేశ్ (కొనాయిపల్లి), చాకలి వెంకటేశ్ (తిరుమలగిరి), ఎర్ర కుమార్ (జీడిపల్లి), అల్లాడి మహేశ్ (చందాయపేట)లను అదుపులోకి తీసుకున్నారు. రాజు నాయక్ పరారయ్యాడు. వారి నుంచి రూ.31,919 నగదు, 9 మొబైల్‌లు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు. జూదం తదితర చట్టవ్యతిరేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిస్తే సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ 87126-67445, 87126-67446, 87126-67447 నంబర్‌లలో సమాచారమివ్వాలని సూచించారు.



మీనాజీపేట పేకాట స్థావరం వద్ద జూదరులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

ఇసుక ట్రాక్టర్ పట్టివేత



బెజ్జంకి పోలీస్ స్టేషన్‌లో ఇసుక ట్రాక్టర్

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని గాగిల్లాపూర్ శివారు.. మోయతుమ్మెద వాగు నుంచి అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను ఆదివారం పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఎస్ఐ కృష్ణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తే శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సంబంధిత అధికారుల నుంచి కచ్చితంగా అనుమతి తీసుకోవాలని తెలిపారు. ఎవరైనా ఇసుకను అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం తెలిస్తే పోలీసులకు తెలిపాలని, తెలిపిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

చలో హైదరాబాద్‌కు తరలిరండి

సిద్దిపేటకమాన్: హైదరాబాద్‌లో ఈనెల 5న జరగనున్న ఎమ్మార్పీఎస్ రాష్ట్ర స్థాయి సమావేశాన్ని జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ తెలిపారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఆయన మాట్లాడారు. రాష్ట్రస్థాయి సమావేశానికి పెద్దెత్తున మాదిగ, ఉపకులాల సంఘాల ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కృష్ణ, సాయిలు, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతులు చేపట్టండి

కేంద్రీయ విద్యాలయం వద్ద తల్లిదండ్రుల నిరసన

సిద్దిపేటఅర్బన్: కేంద్రీయ విద్యాలయానికి వెళ్లే రోడ్డును బాగు చేసి రోడ్డు ప్రమాదాలను నివారించాలని కేంద్రీయ విద్యాలయం విద్యార్థుల తల్లిదండ్రులు కోరారు. శనివారం కేంద్రీయ విద్యాలయం వెళ్లే దారిని బాగు చేయాలని డిమాండ్ చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రీయ విద్యాలయం నూతన భవనంలోకి మారిందనే సంతోషం కంటే విద్యాలయానికి వెళ్లే దారి ప్రమాదకరంగా ఉండటం ఆందోళన కలిగిస్తోందన్నారు. రోడ్డులో పది మలుపులు ఉండడంతో ఆటోలో వచ్చే విద్యార్థులు రోజూ ప్రమాదకరమైన ప్రయాణం చేయాల్సి వస్తోందన్నారు. సింగిల్ రోడ్డు కావడంతో ఎదురుగా మరో వాహనం వస్తే ఇబ్బందవుతోందన్నారు. పైగా రోడ్డుకు ఇరువైపుల ముళ్ల పొదలు, చెట్లు పెరిగి వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని వాపోయారు. మలుపు వద్ద వాహనాలు అదుపుతప్పిన సంఘటనలు ఉన్నాయన్నారు. రోడ్డుపై భారీ వాహనాలు ప్రయాణించడం వల్ల రోడ్డు గుంతల మయంగా మారిందని, ప్రభుత్వ మెడికల్ కళాశాల నుంచి కేంద్రీయ విద్యాలయం వరకు ఉన్న రోడ్డు మలుపులు సరి చేస్తూ రోడ్డును నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు క్రిష్ణమూర్తి, రాజు, రంజిత్‌రెడ్డి పాల్గొన్నారు.



గుంతల రోడ్డు వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థుల కుటుంబసభ్యులు

అ'పూర్వ' సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనలో పూర్వ విద్యార్థులు

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లి మండల కేంద్రంలోని హైస్కూల్‌లో 2012-13 సంవత్సరానికి చెందిన 10వ తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. 12 ఏళ్ల తరువాత అందరూ కలుసుకొని నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని సందడిగా గడిపారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వడ్డెపల్లి నాగరాజు, శ్రీనివాసాచారి, మల్లయ్య, రవి, కనకలక్ష్మి, సాజిద్‌లతో పాటు మరికొందరిని శాలువాతో సన్మానించి ఆశీర్వాదాన్ని తీసుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు బాబు, మధు, స్వామి, ప్రశాంత్, రాజు, శ్రీకాంత్, ఈశ్వర్, రమేశ్, కరుణాకర్, ప్రమీల, శ్యామల, జ్యోతి, మంగ, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి



నర్సాపూర్ ప్రభుత్వ ఆస్పత్రిలో రోగితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

నర్సాపూర్: ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని ఎమ్మెల్యే సునీతారెడ్డి వైద్యులకు సూచించారు. ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని అన్ని వార్డుల్లో తిరిగి రోగులతో మాట్లాడారు. వైద్యం ఎలా అందుతుందని, అవసరమైన మందులు ఇస్తున్నారా అని రోగులను అడిగి తెలుసుకున్నారు. కాగా దోమలు ఎక్కువగా వస్తున్నాయని పలువురు రోగులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. అనంతరం సోమవారం ప్రారంభించనున్న డయాలసిస్ సెంటర్ కోసం కేటాయించిన గదుల్లోకి వెళ్లి వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించడంతో పాటు అన్ని మందులు ఇవ్వాలని, దోమలు రాకుండా చర్యలు తీసుకోవాలని ఆస్పత్రి విధుల్లో ఉన్న వైద్యులు డాక్టర్ రాముకు సూచించారు. ఆమె వెంట పలువురు నాయకులు ఉన్నారు.

● కంకర దారి.. ప్రమాదకరంగా మారి



కంకర తేలిన రోడ్డు



ప్రమాదకరంగా మారిన సీసీ రోడ్డు

మిరుదొడ్డి మండల కేంద్రంలో ఉన్న సీసీ రోడ్డు పాడై కంకర తేలింది. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందవుతోంది. జనాలు నడిచేందుకు కూడా ఇబ్బందులు పడుతున్నారు. రాళ్లు అడపాదడపా కాళ్లకు తగులుతుండటంతో గాయాలవుతున్నాయని గ్రామస్తులు అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరమ్మతు చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మిరుదొడ్డి(దుబ్బాక)

సంక్షిప్త వార్తలు


◆ **బాధితుడికి ఎల్ఓసీ అందజేత**



మద్దూరు(హుస్నాబాద్): మండలంలోని సలాఖపూర్ గ్రామానికి చెందిన బియ్య రాకేశ్‌కు రూ. 4 లక్షల ఎల్ఓసీని కాంగ్రెస్ నాయకుడు నాగపూరి కిరణ్‌కుమార్ అందజేశారు. ఈ మేరకు అతను కిడ్నీ మార్పికి ఈ నగదును వినియోగించుకోనున్నారని తెలిపారు. ఎల్ఓసీకి సహకరించిన మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

◆ **ఎల్లమ్మ ఆలయ నిర్మాణానికి భూమి పూజ**

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ మండలం కూచనపెల్లిలో రేణుకా ఎల్లమ్మ దేవాలయ నిర్మాణానికి ఆదివారం భూమి పూజ జరిగింది. ఈ సందర్భంగా గౌడ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు మార్క అనిల్‌కుమార్ మాట్లాడారు. గీతా కార్మికులు తమ కుల దైవం ఎల్లమ్మ తల్లికి పూజలు చేసిన తర్వాతే తాటి చెట్టు ఎక్కుతారన్నారు. కులవృత్తికి ప్రభుత్వం ప్రత్యేక ప్యాకేజీ కేటాయించి చేయూత ఇవ్వాలని కోరారు. కులగణన జరిగిన వెంటనే జనాభా ప్రతిపాదికన బడ్జెట్‌లో నిధులు కేటాయించాలన్నారు.



◆ **ఎమ్మెల్యే పరామర్శ**

దౌల్తాబాద్(దుబ్బాక): మండల పరిధిలోని గాజులపల్లిలో గురువారం రాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మారుపాక అర్జున్ ఇల్లు దగ్ధమైందన్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ఆదివారం బాధితుడిని పరామర్శించారు. రూ. 10 వేల ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అప్పవారు శ్రీనివాస్, బొల్లి చంద్రం, పంజ స్వామి, ఆంజనేయులు, గ్రామప్రజలు పాల్గొన్నారు.

◆ **మాజీ మేయర్ ..**

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని బేగంపేటలో బీఆర్ఎస్ సోషల్ మీడియా నియోజకవర్గ ఇన్‌చార్జి శేఖర్‌బాబు సోదరుడు ఇటీవల రోడ్డు ప్రమాదంలో ఇటీవల మృతిచెందగా.. బాధిత కుటుంబాన్ని ఆదివారం కరీంనగర్ మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్ పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు హరిప్రసాద్, తిరుపతి, శాతవాహన వర్సిటీ విద్యార్థులు పాల్గొన్నారు.